క్లుప్తంగా

పూడికతీత పనుల పరిశీలన



డ్రెయినేజీ సిల్ట్‌తీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న డ్రెయినేజీల పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య బుధవారం పరిశీలించారు. పూడికతీత పనులు శుభ్రంగా, సవ్యంగా నిర్వహించాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. వర్షాలు పడితే మురుగు సవ్యంగా పారేలా, దోమలు పెరగకుండా పూడికతీత పనులు చేస్తున్నట్టు చెప్పారు. ఆయనవెంట మున్సిపల్ ఏఈ ప్రవీణ్‌చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్ ఉన్నారు.

తమ్ముడిపై అన్న దాడి

నరసాపురం రూరల్: కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్నదమ్ములు ఘర్షణ పడగా తమ్ముడుకి గాయాలపాలైన సంఘటన మొగల్తూరు మండలం కాళీపట్నం పడమర గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం గ్రామంలో అన్నదమ్ముల మధ్య ఐదు సెంట్ల ఇంటి స్థలానికి సంబంధించిన తగాదా నేపథ్యంలో కవురు మణిబాబు, అతని భార్య కష్ణవేణిని వారి వారసులను అతని సోదరులు కవురు శ్రీను, రామకృష్ణ, శివన్నారాయణ, రంగ, పండు, భాస్కరరావు, మురళీలు స్థానిక రహదారిపై పడవేసి ఇనుప రాడ్డులు, కర్రలతో కొట్టి చంపే ప్రయత్నం చేశారు. ఈ ఘర్షణలో గాయపడ్డ కవురు మణిబాబుని 108 వాహనంపై నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే దంపతులపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.వాసు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్న రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్గో సేవలు, కార్గో డోర్ డెలివరీ సేవలు, ప్రత్యేక బస్సులు, శుభకార్యాలకు బస్సుల ఏర్పాటు వంటి అంశాల్లో ఇబ్బందులు ఉండే సంప్రదించాలని కోరారు. అలాగే ఆర్టీసీ సేవలకు సంబంధించి సూచనలు స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

ఉత్సాహంగా అక్షరాభ్యాసం



విద్యార్థులకు అక్షరాభ్యాసం చేస్తున్న సూర్యకుమార్

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల్లో ముందుగా క్రమశిక్షణ ఉండాలని ఆ క్రమశిక్షణ ఉంటే విద్యకు మంచి పునాది అవుతుందని చింతలగరువు మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్ అన్నారు. బుధవారం స్థానిక పోడూరు మండలం వద్దిపర్రు గ్రామం శివారు చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో బి.కళ్యాణి, బి.భాగ్యలక్ష్మీ, జి.దేవి, కేఎల్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై కళాజాత



వడలిలో పరిసరాల పరిశుభ్రతపై నిర్వహిస్తున్న కళాజాత ప్రచారం చేస్తున్న దృశ్యం

పెనుగొండ: పరిసరాల పరిశుభ్రతపై జిల్లా కలెక్టరు ఆదేశాలతో బుధవారం వడలిలోని రామాలయం వద్ద కళాజాత ప్రదర్శన నిర్వహించారు. తడిచెత్త-పొడి చెత్త, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణం, ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలు జానపద పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. గృహ వ్యర్థాలను డ్రెయినేజీ, పంట కాలువల్లో వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించి సహకరించాలని సూచించారు. కుళాయి నీరు వృథా కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

పెనుగొండ: రాష్ట్రంలో వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం నడిపూడిలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు యంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి స్పందన, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నీరివ్వండి మహాప్రభో!

యలమంచిలి: ఒకవైపు తాగునీరు లేదు..మరొక వైపు నారుమడులకు ఆలస్యమవుతుంది..తాగు, సాగు నీరివ్వండి మహాప్రభో! అంటూ ప్రజలు, రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతి ఏడాది జూన్ రెండో వారంలో కాలువ నీరు వచ్చేది. ఈ ఏడాది మూడవ వారం వచ్చిన కాలువ నీరు ఇవ్వకపోవడంతో ఆకుమడులు వేయడానికి ఆలస్యమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చించినాడ పంట కాలువపై గుమ్ములూరు నుంచి పెనుమర్రు వరకు అనేక చోట్ల రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తున్నారు. ఈ పనులు ఆలస్యం కావడంతో ప్రధాన పంట కాలువకు నీరు వచ్చిన గుమ్ములూరు వద్ద అడ్డం వేసి చించినాడ పంట కాలువకు నీరు ఆపేశారు. దీంతో గుమ్ములూరు నుంచి యలమంచిలి వరకు తొమ్మిది గ్రామాలలో సుమారు 4 వేల ఎకరాలలో సాగు ఆగిపోయింది. ఒకవైపు వర్షాలు కురుస్తుండటతో ఈ సమయంలో కాలువ నీరు వస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుందని రైతులు చెబున్నారు. ఇదిలా ఉండగా ఈ కాలువ పై ఆధారపడి రావిపాడు, పెనుమర్రు, నేరేడుమిల్లి, మేడపాడు మంచినీటి చెరువులు ఉన్నాయి. ఈ గ్రామాల్లో కూడా మంచినీటి చెరువుల్లో నీరు ఇంకిపోయింది. ఈ గ్రామాల ప్రజలు తాగునీరు కోసం అలమటిస్తున్నారు. కాలువ నీరు వచ్చిన వారం తరువాత కాని మంచినీటి చెరువులు నింపడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో అధికారులు సత్వరమే కాలువ నీరు విడుదల చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



యలమంచిలి మండలం మేడపాడు వద్ద నీరు లేని చించినాడ కాలువ



యలమంచిలి మండలం పెనుమర్రు వద్ద ఖాళీ చేలు



యలమంచిలి మండలం మేడపాడు మంచినీటి చెరువులో అడుగంటిన నీరు

నారుమడులు ఆలస్యమయ్యాయి



ప్రతి ఏడాది జూన్ నెల మధ్యలో నారుమడులు వేసేవాళ్లం. ఇప్పటి వరకు కాలువ నీరు రాకపోవడంతో ఈ నెలాఖరుకు కూడా నారుమడులు వేసే పరిస్థితి లేదు. జూన్ నెలాఖరుకు ఆకుమడులు వేస్తే ఆగష్టులో ఊడ్చాలి. ఆగష్టులో ఊడ్చితే అక్టోబర్ నెలాకరు లేదా నవంబర్‌లో కోతలు వస్తాయి. ఆ సమయంలో తుఫాన్‌లు, వర్షాలు వచ్చే అవకాశం ఉంది. నారుమడులు ఆలస్యం అవడం వల్ల ఈఏడాది పంట వర్షార్పణం అవుతుందేమోనని ఆందోళనగా ఉంది.

– వీరా ఉమా శంకర్, రైతు, గుంపర్రు

తాగునీరు దుర్వాసన వస్తుంది



మంచినీటి చెరువులో నీరు అడుగంటిపోవడంతో పంచాయతీ కుళాయిల ద్వారా సరఫర చేసే నీరు దుర్వాసన వస్తుంది. ప్రతి ఏడాది జూన్ రెండవ వారంలో కాలువ నీరు వచ్చేది. ఈ ఏడాది మూడవ వారం వచ్చిన కాలువ నీరు రాలేదు. కాలువ నీరు వచ్చాక మూడు, నాలుగు రోజులు నీరు కిందకు వదిలిన తరువాత మాత్రమే చెరువులో నీరు పెడతారు. ఆ లెక్కన ఈ నెలాఖరు వరకు చెరువులో నీరు నింపే పరిస్థితి కనిపించడం లేదు. అప్పటి వరకు ఈ కంపు కొడుతున్న నీటినే తాగితే రోగాలపాలవడం ఖాయం. – పాకా సూర్యనారాయణ, పెనుమర్రు

వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర వైఎస్సార్ సీపీ అంగన్వాడీ విభాగం ఉపాధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన మద్దా చంద్రకళ నియమితులయ్యారు. పార్టీ సీనియర్ నాయకురాలిగా అనుభవం ఉన్న చంద్రకళకు రాష్ట్ర పదవి చేపట్టడం అభినందనీయమని బుధవారం పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు మాట్లాడుతూ కష్టపడే వారికి పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని అన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో చంద్రకళకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యడ్ల తాతాజీ, యినకొండ రవి, కోరాడ శ్రీనివాసరావు, బండి రమేష్, రేలంగి శ్రీను, ఉండ్రాజవరపు రవి, శంకరాపు శ్రీను, గుడాల సురేష్, పాలపర్తి కృపానాథ్, గంటా నరేష్, చెన్ను విజయ్, కెల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చంద్రకళను అభినందిస్తున్న గుడాల గోపి

గ్రామ మహిళా సమాఖ్య భవనం నిరుపయోగం

పెనుమంట్ర: మండల కేంద్రమైన పెనుమంట్రలో గ్రామ మహిళా సమాఖ్య భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని గ్రామంలో మహిళా సంఘాలు కనీసం వినియోగించకపోవడంతో అక్కడ దుర్గంధ భరితంగా మారి, భవనం శిథిల దశకు చేరుకుంది. 2018లో ఎన్‌జీఎంఆర్‌ఎస్ నిధులు రూ.13 లక్షలు వెచ్చించి ఈ భవన నిర్మాణాన్ని చేపట్టి 2019 ఫిబ్రవరిలో అప్పటి కార్మిక శాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఈ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అప్పటి నుంచి ఒకటి, రెండు సార్లు ధాన్యం కొనుగోలు సమయాల్లో ఈభవనాన్ని వినియోగించారే తప్ప ఎప్పుడూ మహిళలు తమ సమావేశాల కోసం ఉపయోగించుకున్న దాఖలాలు కనబడలేదు. రాజీవ్ కాలనీలో ఐసీడీఎస్ కార్యాలయ భవనానికి పక్కనే స్టేట్‌హైవే రోడ్డుకు ఆనుకుని ఈ భవనం నిర్మించారు. మహిళా సమాఖ్య అవసరాల కోసం ఈభవనాన్ని వినియోగించుకోకుండా తమ సమావేశాలను ఎప్పుడూ సీఏలు తమ ఇళ్ల వద్దనే నిర్వహించడమే తప్ప తమకు ఒక భవనం ఉందనే సంగతి కూడా మర్చిపోవడంతో భవనం పరిసర ప్రాంతాలలో ఉన్న కొందరు భవన పరిసరాలను ఆక్రమించుకుని బట్టలు ఆరవేయడం తదితర తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కనీసం వారు పరిసరాలను శుభ్రం చేయకపోవడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ భవనం నిరుపయోగంగా మారింది.



ఐసీడీఎస్ భవనం పక్కనే నిరుపయోగంగా ఉన్న గ్రామ మహిళా సమాఖ్య భవనం

మందాలమ్మకు ముక్కెర సమర్పణ

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మకు రాజమహేంద్రవరానికి చెందిన గణపతినీడి వెంకట కిశోర్, సుభాషిణీ దంపతులు బంగారు ముక్కెర సమర్పించారు. బుధవారం ఆలయ ప్రాంగాణంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు ఎనిమిది గ్రాముల ముక్కుపుడకను అందించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుమంట్ర: మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పెనుమంట్ర ఎలక్ట్రికల్ ఏఈ జి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ లైన్ల రిపేరు, చెట్ల కొమ్మలు తొలగించడం తదితర కారణాలతో ఈ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వివరించారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జాతీయ కార్యవర్గ సమావేశం విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

పెనుగొండ: హైదరాబాదులో ఈనెల 19న జరిగే వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. బుధవారం ఆచంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగులకు పింఛన్ రూ.6 వేలు చేయించిన ఘనత మహాజననేత మందకృష్ణ మాదిగకు చెందుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చదలవాడ ముత్యాలరావు, ప్రసాదబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి తానేటి చినబుల్లియ్య మాదిగ, పైడియ మాదిగ, బత్తిన చిట్టిబాబు మాదిగ, కనపాల పెద్దిరాజు పాల్గొన్నారు.

భీమవరంలో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు భీమవరం డిపో మేనేజర్ పీఎస్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. బుధవారం భీమవరం ఆర్టీసీ డిపోలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వాహన రంగంలో డ్రైవర్ల కొరతను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ సర్టిఫికెట్‌తో లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్‌ను హెవీ లైసెన్స్ గా పొందటానికి నిపుణులతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. బ్యాచ్ కు 16 మందికి 32 రోజులపాటు శిక్షణ అందిస్తున్నామని, మొదటి బ్యాచ్ పూర్తి అయిన తరువాత రెండో బ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు. త్వరలో డ్రైవింగ్ క్లాసులు ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్యలను పట్టించుకోరా?



మండలపరిషత్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సుమారు రెండు గంటల పాటు జరిగిన నరసాపురం మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో గంటకు పైగా తాగునీటి సమస్యపైనే చర్చ నడిచింది. ఎంపీపీ మైలాబత్తుల సోని అధ్యక్షతన బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పలువురు సభ్యులు ఆరోపించారు. తూర్పుతాళ్లు, రుస్తుంబాద, లక్ష్మణేశ్వరం ప్రాజెక్టుల ద్వారా సరఫరా అయ్యేనీరు, మురికిగా ఉన్నాయంటూ సభ్యులు ధ్వజమెత్తారు. మల్లవరం ఎంపీటీసీ సభ్యురాలు ఇంజేటి మేరీ రత్నం మాట్లాడుతూ గ్రామంలోని మంచినీటి చెరువు అడుగంటి నీరు బురదమయంగా మారిందని ఆరోపించారు. బురదమయమైన నీటిని ప్లాస్టిక్ సీసాలో తీసుకు వచ్చి సమాశంలో అందరికీ చూపించారు. మల్లవరంలో డ్వాక్రా సంఘాలకు చెందిన వీఓఏలు ఈ-కేవైసీ పేరుతో ప్రతి సభ్యుడి వద్ద నుంచి రూ.20లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై వెలుగు ఏపీఎం నాగభూషణం నాయుడు మాట్లాడుతూ వీఓఏలకు ప్రభుత్వం జీతం ఇస్తోందని, ఎవరూ సొమ్ములు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయమై విచారణ చేస్తామన్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేదంటూ సర్పంచ్‌లు బొక్కా రామస్వామి, నల్లి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కోలపర్తి రామకృష్ణ తదితరులు మాట్లాడారు. లక్ష్మణేశ్వరం ఎంపీటీసీ సభ్యుడు కోలపర్తి రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని శ్రీరాంనగర్ కాలనీలో వంద కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ తాగునీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేష్ సమర్థవంతంగా పనిచేయడం లేదంటూ ఆరోపించారు. తమ గ్రామంలో జల్‌జీవన్‌మిషన్ పనులు ఎందుకు జరగడంలేదని ఎంపీటీసీ సభ్యురాలు ఇంజేటి మేరీరత్నం ప్రశ్నించారు. తమ గ్రామంలో 70 మంది వరకు తల్లికి వందనం సొమ్ము తల్లుల ఖాతాలో జమ కాలేదని కొప్పర్రు ఎంపీటీసీ సభ్యురాలు పత్తి లక్ష్మీ సంపూర్ణ అడగడంతో సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంఈఓ పుష్పరాజ్యం హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలను చర్చించి పరిష్కరించేందుకు ఉద్దేశించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడం సరికాదన్నారు. సమావేశంలో డెల్టా ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ వీకే వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై ఆగని కూటమి అరాచకాలు



సమావేశంలో మాట్లాడుతున్న జయ సరిత

పాలకొల్లు సెంట్రల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, అరాచకాలు పెరిగాయని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పంలోనే మహిళలకు రక్షణ లేకపోతే ఇంక రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఎక్కడ ఉంటుంది? అని ప్రశ్నించారు. కుప్పంలో శిరీష అనే మహిళను ఓ టీడీపీ నాయకుడు చెట్టుకు కట్టేసి కొట్టే దారుణమైన స్థితి ఏర్పడిందంటే సంవత్సరంలోనే కూటమి పాలన ఎంత దిగజారిపోయిందో అర్థం అవుతుందన్నారు. కన్నబిడ్డను పక్కన పెట్టుకుని ఇంత దౌర్జన్యానికి దిగజారారంటే టీడీపీ నాయకుల అరాచకం ఎంతదారుణంగా ఉందో ప్రజలకు తెలిసి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, వీరా మల్లికార్జునుడు, రామానుజుల చిన్న మధు, నాతి చరణ్ కుమార్, హేమలత, కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మందుల పంపిణీ



బాధితులకు మందులు పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు రోగులకు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ. 18 వేలు విలువ చేసే మందులు అందజేశారు. బుధవారం బాధితులకు మందులు పంపిణీ చేసిన అనంతరం క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడే పేదలకు వాకర్స్ క్లబ్ ఎప్పుడు తమ వంతు సహకారం అందిస్తుందన్నారు. 16వ వార్డు పెదపేటకు చెందిన ఈ రాణి, వడ్లవానిపాలేనికి చెందిన బి.రామ్మోహన రావు, తూర్పుగోదావరి జిల్లా లక్కవరానికి చెందిన వి.దేవదాసులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకర్రావు, కర్రి కిరణ్ కుమార్, సోమంచి శ్రీనివాసశాస్త్రి, గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు భార్య ధర్నా



భర్త ఇంటి వద్ద ధర్నా చేస్తున్న భార్య దుర్గా భవాని

నరసాపురం రూరల్: మండలంలోని పాత నవరసాపురంలో తన భర్త, అత్త మామలు తనను వేధిస్తున్నారంటూ బుధవారం భర్త బర్రె శివశంకర్ ఇంటి ముందు భార్య దుర్గ భవాని ధర్నాకు దిగింది. తనది నరసాపురం మండలం పెదమైనవానిలంక గ్రామం అని నాలుగు నెలల క్రితం పాతనవరసపురం గ్రామానికి చెందిన వ్యక్తితో పెద్దల సమక్షంలో వివాహమైందని ఆమె పేర్కొన్నారు. అయితే కొన్ని రోజులుగా తనను ఇంట్లోకి రానియకుండా తాళం వేస్తూ బయట పడుకోబెడుతున్నారని బాధితురాలు వాపోయింది. తనలో లోపాలు ఉన్నాయంటూ తన భర్తతో పాటు కుటుంబ సభ్యులు అవమానిస్తున్నారని ఆరోపించింది. అలాగే తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితురాలు వాపోయింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది.

సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఎర్ర రక్త కణాలను ప్రభావితం చేస్తుందని, వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో పీఎం జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా సికిల్‌సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 2047 నాటికి సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి జి.గీతాబాయి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా టిడ్కో రోడ్డు



టిడ్కో రహదారిలో రోడ్డు కింద కొట్టుకుపోయిన మట్టి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పూలపల్లి బైపాస్ రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా ఉన్న టిడ్కో గృహాలకు వెళ్లే రహదారి ప్రమాదకరంగా తయారవుతుంది. నరసాపురం రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా ఉన్న వంతెనకు టిడ్కో గృహాలకు వెళ్లే ఎడమవైపు సర్వీస్ రోడ్డు దిగిన వెంటనే కాలువకు రివిట్‌మెంట్ వాల్ లేకుండా కొంత భాగం ఉంది. ఆ ప్రాంతంలో భారీ వాహనాలను కడుక్కుంటూ ఉంటారు. ఈ సందర్భంలో అక్కడ మట్టి మొత్తం కొట్టుకుపోవడంతో రోడ్డు మార్జిన్ కింద ఖాళీ ఏర్పడింది. ఈ రోడ్డులో భారీ వాహనాలు వెళుతుండడంతో ఏదో ఒక రోజు రోడ్డు కుంగిపోవడం తప్పనిసరని స్థానికులు వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. అయితే ఈ అగాదాన్ని పూడ్చాలని లేదంటే ఇక్కడ కూడా ఒక రేవు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో వాతావరణ శాఖ కార్యాలయం

- స్థలం కోసం రెవెన్యూ శాఖకు లేఖ
- 14 ఏళ్లుగా పెండింగ్‌లోనే ఫైల్

నరసాపురం: నరసాపురం భారత వాతావరణశాఖ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. అరకొర సౌకర్యాల మధ్య ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కీలకమైన వాతావరణ సమాచారం సేకరించే ఈ కేంద్రంలో వసతులు సరిగ్గా లేని కారణంగా, కచ్చితమైన సమాచారం సేకరించడానికి సాంకేతికంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా మొత్తానికి ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ నరసాపురంలోనే ఉంది. తీరప్రాంతం కావడం, తరచూ తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తులు రావడంతో ముందు ఆలోచనలతో భారత వాతావరణశాఖ ఇక్కడ కార్యాలయాన్ని నిర్మించింది. 1982లో ఇక్కడ వాతావరణ సమాచారం సేకరించేందుకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో భవనం నిర్మించారు. 1984లో స్థానికంగా వాతావరణశాఖ సేవలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి అదే భవనంలో వాతావరణశాఖ కార్యాలయం పని చేస్తుంది.

కచ్చిత సమాచారంకోసం తిప్పలు

వాతావరణశాఖ భవనం హౌసింగ్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం పైన గదిలో కొనసాగుతుంది. భవనం శిథిలావస్థకు చేరింది. జిల్లాకు సంబంధించి ప్రధానమైన స్టేషన్. వర్షపాతం వివరాలతో పాటు, తుఫాన్‌ల తీవ్రత, ఉష్ణోగ్రతలు, గాలివేగం, గాలిలో తేమశాతం వంటి వివరాలు ఎప్పటి కప్పుడు నమోదు చేస్తారు. సమాచారాన్ని విశాఖపట్టణం, పూనె, హైదరాబాద్ వాతావరణశాఖ కార్యాలయాలకు చేరవేస్తారు. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ కూడా కార్యాలయం పక్కనే ఉంది. అయితే విలువైన ఈ పరికరాలు ఉన్న ప్రాంతం చుట్టూ చెట్లు పెరిగిపోయాయి. కార్యాలయం కూడా శిథిలావస్థలో ఉండటంతో కచ్చిత సమాచారాన్ని రాబట్టడానికి అధికారులు తిప్పలు పడాల్సి వస్తోంది.



నరసాపురంలో అసౌకర్యాల మధ్య కొనసాగుతున్న భారత వాతావరణ శాఖ కార్యాలయం

పెండింగ్‌లో అభివృద్ధి ప్రతిపాదనలు

ఎకరం స్థలంలో అధునాతన స్టేషన్‌ను , సిబ్బందికి క్వార్టర్స్‌ను నిర్మించాలనే ప్రతిపాదన దాదాపు 14 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉంది. ఎకరం స్థలం కోసం వాతావరణ శాఖ 2011లో అప్పటి ఉమ్మడి పశ్చిమ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసింది. అయితే రూరల్ ప్రాంతంలో స్థలం ఇస్తామన్నారు. అప్పటి నుంచి ఈ ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉంది. ప్రస్తుతం కార్యాలయ భవనం ఉన్న పక్కనే సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న 15 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని మూడేళ్ల క్రితం వాతావరణశాఖ కోరింది. ఈ మేరకు సబ్ కలెక్టర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. స్థలం మంజూరు చేస్తే క్వార్టర్స్‌ను మినహాయించి, అధునాతనంగా మూడంతస్తుల్లో వాతావరణశాఖ కార్యాలయ భవనాన్ని నిర్మిస్తామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఈ ఫైల్ కూడా పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం.



చుట్టూ చెట్ల మధ్య ఉన్న ఆటోమేటిక్ వెదర్ స్టేషన్